మల్లె పువ్వు

పెరటిలో మల్లెతీగ మొగ్గ తొడిగింది. ఆ చిన్న చిన్న మొగ్గలు పచ్చటి పరికిణీలు కట్టిన చిన్నారి, అంద మైన తెల్లటి ముస్తాబయిన పాపాయిల్లాగ వున్నాయి. ఎన్ని మొగ్గలు! తీగ తీగకూ మల్లె మొగ్గలు. హృదయాల్ని కదిపి వేసే మల్లెమొగ్గలు. అద్భుతమైన పరిమళాల్నిచ్చే, సృష్టిలో అత్యంత అద్భుతమైన, మానవమాత్రుడు దేవత్వాన్ని పొందడానికి అవకాశం కల్పించే, గొప్పసృష్టి మల్లెమొగ్గలు!

మల్లెమొగ్గలు, మగువల మనసులు పరిమళాల్తో విక సించునట్లు వికసిస్తాయి. ఆ వికాసమిచ్చే దివ్యమైన అనుభ వాన్ని మానవులు ఎప్పటినుంచో, ఎంతో నిండు హృద యాలతో అనుభవించి తమ జన్మలు తరింప జేసుకుంటూనే వున్నారు.

మల్లె పాదుకు ఎదురుగా ఆ యింటి పెరటి వైపు వరండాలో మడతకుర్చీలో కూర్చొని ఎంతో ఆప్యాయంతో ఆహ్లాదంతో మల్లె మొగ్గల్ని, అక్కడక్కడా వికసించిన మల్లెపువ్వులనూ చూస్తూ, ఊహాలోకంలోకి వెళ్ళిపోతు న్నాడు శంకరం.

శంకరానికి మల్లెమొగ్గలకు అవినాభావ సంబంధం! శంకరం ఆవూరొచ్చి ఆయింటికొస్తేగానీ ఆ మల్లెలు వికసిం చించవు. ఆ తీగలు మొగ్గలు తొడిగితేగానీ శంకరం ఆవూరు

ఆ యిల్లు, ఆ చోటుకు రాడు. రావడానికి వీలులేదు. కొన్ని యేళ్ళుగా అలాగే జరుగుతూ వచ్చింది.

శంకరం యూనివర్శిటీ ఆనర్సు పరీక్షలు పూర్తిచేసి ఇంటికి వచ్చాడు. ఆ యింట్లో దీనురాలైన తల్లి ఒక్కతే వుంది.

శంకరం అలా ఆ మల్లె పందిరికేసి చూస్తూ వుంటే గడచిన రోజులన్నీ జ్ఞాపకం వస్తున్నాయి.

◆ ◆ ◆

ఆ రోజుల్లో అతనికి దిగులూ, బెంగా వుండేవికావు, ఎంతో ఆనందంగా రోజులు గడిచిపోయేవి.

అత్తయ్యకూతురు పద్మతో ఎంతో సరదాగా ఆడు కుంటూ మాట్లాడుతూ రోజులు క్షణాలుగా వెళ్ళబుచ్చే వాడు.

చిన్నప్పుడు ఈ మల్లెపందిరి దగ్గరే ఆడుకొనేవారు. ఎండాకాలం మల్లెపందిరి ఎక్కి మంచి మంచి మొగ్గలూ, పూలూ తుంపి ఆమెకిచ్చేవాడు. ఆమె వాటిలో కొన్నిటిని అతనిమీద చల్లి, మిగతవాటిని ఒడిలో భద్రపరచుకొని పారి పోయేది. అప్పుడతని వొళ్ళంతా నవ్వి పొంగి పొయ్యేది. చాల గొప్పపని చేశాననుకొనేవాడు. ఆమె వెళ్ళిపోయిన తర్వాత రాలిన మొగ్గ లన్నీ ఏరి దాచేవాడు. అలా ఎన్నో ఏళ్ళు గడిచిపోయాయి. వయస్సు ఎక్కువైనా వాళ్ళ స్నేహంలో మార్పేమీ లేదు. ఎన్నో వందలసార్లు అతను మల్లెమొగ్గలు త్రుంపి అవన్నీ పద్మకు యిచ్చి ఆమె సంతోషం చూసి ఆనందించాడు.

శంకరం నాన్నగారు ఒక ప్రైవేట్ కంపెనీ బ్రాంచికి మేనేజరుగా పనిచేస్తూ వుండేవారు. ఆయన చాలా సుఖంగా జీవించాలనే కోరికగలిగిన మనిషి. అనవసరమైన కష్టాలను చాల దూరంలో వుంచేవాడు. సంపాయించి కూడబెట్టడం కన్న, సంపాయించినదానిని బాగా అనుభవించి తరించాలనే రకం మనిషి. ఆయన తన సిద్ధాంతాన్ని అక్షరాలా అమలు జరిపారు. మంచి సుఖమైన కుటుంబ జీవితం గడిపారు. ఉద్యోగంకూడా ఎంతో సామర్థ్యంతో నిర్వహించారు. తత్ఫలితంగా కంపెనీ అధికారులు. ఆయనకు త్వరలో ప్రమోషన్ ఇవ్వాలనికూడా నిర్ణయించారు.

ఆయనకు వ్యసనాలు ఎక్కువగానే వున్నవి. ముఖ్యంగా కాఫీలు. సిగరెట్లు అమితంగా ఉపయోగించేవారు. కొంత మంది స్త్రీలతోకూడా సంబంధముండేది. అయితే ఆయన పెద్దమనిషి. అంతా రహస్యంగా వుంచేసుకునేవారు.

కొద్ది రోజులలోనే ప్రమోషన్ రావచ్చుననుకుంటూ వుండగా ఆయనలో హఠాత్తుగా కేన్సర్ లక్షణాలు పొడ సూపినవి. వెంటనే హాస్పిటల్లో చేర్పించారు. పద్మ నాన్న వెంకటరత్నం ఆయన ఆరోగ్యం విషయంలో పూర్తి శ్రద్ధ తీసుకొన్నాడు. రెండు ఆపరేషన్లు జరిగాయి ఇక బాగుపడని స్థితికి అప్పటికే వచ్చేసింది వైద్యులకృషి ఫలించలేదు ఒక రాత్రిపూట, ఆయన శాశ్వతంగా కళ్ళు మూసుకున్నారు. అర్థాంగి, ఏకైకపుత్రుడు నిరాధారులై నిలిచిపోయారు.

ఆయన అర్ధాంగి సరస్వతమ్మ మహాదొడ్డ యిల్లాలని పించుకొంది. ఆమె భర్తకోసం తన సకల వాంఛలనూ, తన

స్వంత అభిప్రాయాలనూ, అభిరుచులనూ త్యాగం చేసింది. ఆమెకు భర్తమీద ఎంత ప్రేమ ఉందో ఆయనకూ ఆమె అంటే అంత ప్రేమఉంది. అయితే అతని భోగలాలసతకు మరికొందరు స్త్రీలు అవసరమయ్యారు. సరస్వతమ్మ, అయినా సరే ఒక్కమాట అనలేదు. ఆయన భవిష్యత్తు కోసం కొంత డబ్బయినా నిలవచేయక పోవడమనేది ఆమె ఉద్దేశాలకు పూర్తిగా వ్యతిరేకం. అయినాసరే ఆమె ఏమీ పైకి చెప్ప లేదు. మౌనంగా వున్నంతవరకే ఇద్దరిమధ్యా ఆ పవిత్రమైన సంబంధం నిలుస్తుందని ఆమె భావించింది. ఒక్కమాట, ఒక్క వ్యతిరేక భావ ప్రదర్శన చాలు, తమ మధ్య అగాధ మేర్పడ టానికి! భర్త దారుణమైన నిరంకుశ స్వభావం కలవాడని ఆమెకు తెలుసు. ఆయన ఉద్దేశాలతో, చర్యలతో ఏకీభ వించి, అడ్డురాకుండా, ఇష్టం లేకపోయినాసరే, లొంగివుండి, తాను పూర్తిగా భర్తను గౌరవిస్తున్నట్లు ప్రవర్తించ లేకపోతే భర్త "దయ" దారితప్పుతుందని ఆమెకు తెలుసు. ఆమె తెలి వైనది. కానీ దీనురాలు. బాధితులైన వేలాది కుటుంబ స్త్రీల ప్రతినిధురాలు ఆమె.

తండ్రి చనిపోయేనాటికి శంకరం ఆనర్స్ చదువు తున్నాడు. ఆ కుటుంబానికున్న స్థిరాస్తులు చాల తక్కువ. రెండెకరాల పొలము, ఎకరా మామిడితోట, మంచిఇల్లు వున్నాయి. ఆయన చనిపోయిన తర్వాత వేలకుపాయల భీమాడబ్బు. సరస్వతమ్మకు ముట్టజెప్పారు. ఆ డబ్బుతోనే శంకరం చదువు సాగించడానికి వీలయ్యింది.

శంకరం మామయ్య వెంకటరత్నం చిన్నప్పుడు శంకరాన్ని ఎంతో ముద్దుగా చూసుకునేవాడు. తనకు కాబోయే అలుడని అతని చదువు సాంగత్యాలపట్ల ఎంతో శ్రద్ధ తీసుకొనేవాడు. అత్తయ్య సరేసరి! తల్లి దండ్రుల గురించి చెప్పనవసరమేలేదు. వారికి ఏకైక పుత్రుడు కాబట్టి తమప్రాణం పోసి అతణ్ణి పెంచి పెద్దజేశారు.

వెంకటరత్నంగారి ఇల్లు, శంకరం ఇల్లు ప్రక్క-ప్రక్కనే వున్నాయి. ఏ ఇంట్లోనో ఒక ఇంట్లో, లేదా తోటలో, పద్మా, శంకరమూ ఒక్కచోటే కనిపించేవారు గానీ ఎప్పుడూ విడిగా కనిపించేవారుకారు. ఇద్దరూ ఒకే ప్రాణంగా పెరిగారు.

అలాంటి ఒకే ప్రాణంలో పగులు ఏర్పడి, ఆ రెండు చిలకలమధ్య ఒక అగాధమే ఏర్పడే పరిస్థితి కలిగింది.

శంకరం నాన్నగారు చనిపోయిన తర్వాత పరిస్థితి తారుమారయిపోయింది. వెంకటరత్నంలో హఠాత్తుగా, అత్యాశ్చర్యకరమైన మార్పువచ్చింది. శంకరం కనిపించగానే ఆయన 'గంభీరత' అనే ముసుగు తొడుక్కుంటున్నాడు. మునుపటి అప్యాయత పూర్తిగా పోయింది. ఆ చూపుల్లో భరించలేనంత కర్కశత్వం కనిపించి శంకరం వాణికి పోయాడు.

సరస్వతమ్మకు సర్వమూ తెలుసు. వెంకటరత్నం వైఖరి ఆమెకు ఆశ్చర్యం కలిగించలేదు. ఆ యిల్లు కట్టించేటప్పుడు పెద్ద శ్రేయోభిలాషిగా అతను అన్నిపనులూ తన చేతికి తీసుకొని, ఎంత డబ్బు కాజేసిందీ ఆమెకు తెలుసు.

వెంకటరత్నం కేవలం వ్యాపారస్థుడు. వ్యాపారస్థుడి మన స్తత్వం ఎలావుంటుందో ఆమె వూహించగలదు.

వెంకటరత్నం ఆశించినట్లు శంకరం నాన్న 'లెక్క లేనంత' డబ్బు మిగిల్చి పోలేదు. బంగారు ఆభరణాలు, పొలాలు, భవనాలు మిగిల్చి పోలేదు. ఆయన చనిపోగానే పల్లెదగ్గరవున్న పొలాన్నీ, ఇంటినీ చనిపోయేముందే రహస్యంగా, అమ్మివేసినట్లు తెలివిడి అయింది. పైగా ఇంట్లో వుండిన బంగారు ఆభరణాలన్నీ ఎప్పుడో హరించిపోయాయని కూడా తెలిసింది. కొన్ని అప్పులుకూడా మిగిల్చి పోయినట్లు తెలిసి చాల కష్టపడిపోయాడు. ఆలోచించి, ఆలోచించి అగ్గయిపోయాడు. ఆ అగ్గిని లోపల కూడబెట్టుకొన్న తర్వాత శరీరం ఆ నిప్పుకు నివురు గప్పినట్లయింది. ఆ నిప్పు ఎప్పుడేం ముప్పు తెస్తుందోనని తల్లి కొడుకులు భయపడ్డారు.

ముఖ్యంగా పద్మకూ, తనకూ ఇంకేమీ సంబంధం లేకుండా పోతుందేమోనని శంకరం విచారం. చిన్నప్పటి నుంచీ రోజూ సాయంకాలం తోటలోచేరి కబుర్లు చెప్పుకోవడం అలవాటు. కాలేజీలో చేరిన తర్వాతకూడా అలాగే రోజులు గడిపారు.

పద్మ ఇంటర్ వరకు చదివి ఆపేసింది. శంకరం ఆనర్స చదవడానికి మద్రాసు వెళ్ళాడు.

తండ్రి చనిపోయిన తర్వాత మొదటిసారిగా వేసవి శలవుల్లో ఇంటికి వచ్చేనప్పటికే పరిస్థితి పూర్తిగా మారి పోయింది. రెండు రోజులైనా పద్మ కనిపించలేదు. ఆ ప్రస్తావన తల్లిదగ్గర తెస్తే, ఆమె ఏమాత్రమూ శ్రద్ధ చూపించ

కుండా నిర్లిప్తంగా వూరుకొంది. తల్లీ తండ్రీ ఆమెను ఇల్లు కదలకుండా చేసి వుంటారనుకున్నాడు.

మూడోరోజు ఉదయం స్నానంచేసి, టిఫిన్ కాఫీ తీసుకొని పద్మయింటికి వెళ్ళాడు.

వరండాలో పద్మ కనిపించింది. లోపలికి వెళ్ళిపోబోయి, శంకరం మరీ దగ్గరికి వచ్చేసరికి ఆగిపోయింది.

"కనిపించడమే మానేశావ్ పద్మా!" అన్నాడు వెళ్ళగానే శంకరం.

"ఎలా కనిపించమంటావు శంకరం!"

ఆ మాటలో తరతరాలనుంచీ 'కన్య' పడినబాధ వ్యక్తమవుతోంది. ఆ మాటలో మానవజాతి పుట్టినది మొదలు నేటివరకూ గల స్త్రీ చరిత్ర సమస్తం విశదీకరింపబడి వుంది!

శంకరం ఆ మాటతో గిలగిల లాడిపోయాడు.

"లోపల మామయ్య వున్నారా" అన్నాడు. 'ఉంటే చెప్పు, వాణ్ణి చంపేస్తానన్న' ట్లుంది, ఆ స్వరం.

"లేరు. అమ్మవుంది" అందామె. ఆ మాటలో అతనికి జవాబు దొరికింది. అత్తయ్య వుండటంవల్ల తామిప్పుడు స్వేచ్ఛగా మాట్లాడుకోటానికి వీలులేదన్న మాట.

"ఈ మార్పంతా ఏమిటో నాకు అర్థం కాకుండా వుంది. ఇంతలో ఎందుకిలా మారిపోయావు పద్మా" అన్నాడు గరగరలాడే గొంతుకతో.

ఆమె రెండు నిమిషాలు మౌనంగా కుడికాలి వేళ్ళు నేలరాస్తూ కళ్ళు క్రిందికివాల్చి వూరుకుంది. కనుగ్రుడ్లు, కరిగి నీరవుతున్నాయా అన్నట్లు కళ్ళలోనీళ్ళు తిరిగాయి.

"నేను మారలేదు. నీకు తెలీదా శంకరం! నీకు తెలియని దేముంది చెప్పు" అంది అతనిగుండె ద్రవింపజేస్తూ:

"అవును. నాకు తెలుసులే పద్మా. నువ్వు సాయంకాలం ఇంటికిరా. అంతా మాట్లాడుకుందాం" అని అతను అక్కడినుంచే ఒకసారి 'ఆశ'తో ఆమె ముఖంలోకి చూసి తృప్తిగా నిట్టూర్చి, వెనుదిరిగాడు. పద్మ అలా చూస్తూ నిల్చుంది.

ఆ సాయంకాలం ఇంటి తోటవేపు వరండాలో మల్లె పందిరి ఎదురుగా నాటిలాగే పద్మకోసం చూస్తూ కూర్చున్నాడు.

ఆ సాయంకాలం ఆమె ఎలాగో వచ్చింది. కటికి చీకటిలో హఠాత్తుగా చంద్రుడుదయించి, ఒక్కసారి చల్లటి వెలుగు నింపేసినట్లు, పద్మ వచ్చింది. వచ్చి అతని హృదయంలో 'జ్యోతి'కి నూనె వేసి, వత్తి ఎగదోసింది.

ఆమె లోపల సరస్వతమ్మతో మాట్లాడటం విన్నాడు. ఇంకో నిముషంలో వస్తుందని చూస్తున్నాడు. ఆమె వస్తూ శంకరాన్ని ఎలా పలకరించాలో బోధపడక సరాసరి మల్లె పందిరి దగ్గరకు నడిచింది. శంకరం ఆమె పందిరిదగ్గరకు చేరే వరకు చూస్తూ వూరుకొని, చేరగానే తనూ వెళ్ళాడు. ప్రక్కనే నిల్చొని మొగ్గలు తుంపాడు. తుంపి రెండు చేతులా నింపుకొని ఆమె ముందుకు చాచాడు. ఆమె దోసిలిపట్టింది. అందులో పూలన్నీ వుంచి మెత్తగా నవ్వాడు. ఆమె విలవిలలాడుతున్న మనసుతో ముఖం ప్రక్కకు త్రిప్పుకొంది.

"మీ నాన్నకు కలగిన దుర్బుద్ధిని నువ్వూ ప్రోత్సహిస్తున్నావా పద్మా" అన్నాడు.

"నీకు తెలీదూ. నా ఉద్దేశం!" అనీ ఆమె జవాబు. ఆ మాటలలో ఎంత గొప్ప అర్థముందిః! శంకరం మాట్లాడ లేదు. పద్మ తన దోసిటిలో పువ్వుల నన్నిటినీ ఒకేచేతికి మార్చుకొని, ఒక మొగ్గతీసి, శంకరం జేబులో పడేలా వేసి వెళ్ళిపోబోయింది.

ఆ మొగ్గ అతని గుండెదగ్గరగా పడింది. అతని మనసు ఎంతో ఆహ్లాదం కలిగింది.

"మనం ఎప్పుడూ విడిపోము. నీమనసు మంచిగా వుంచేచాలు" అని గట్టిగా అన్నాడు. ఆమె వింటూ అలా వెళ్ళిపోయింది.

♦ ♦ ♦

మరుసటేడు వేసవిలో పరిస్థితి ఇంకా మారిపోయింది. పద్మను చాలసార్లు చూశాడు. మాట్లాడే అవకాశం కలగ లేదు. వెంకటరత్నం ఎప్పుడూ వరండాలోనే కుర్చీ వేసు కూర్చుని తల వార్తాపత్రికలో దూర్చి, కళ్ళతో ప్రక్కగా ఆ వీధిలో వెళ్ళే ఆడపిల్లల్ని చూస్తూవుంటాడు. తను అలా వెళ్తే, ఉరిమిచూసి, తల దించు కుంటున్నాడు.

ప్రతిరోజూ మల్లెపువ్వులు కోసి పద్మ చెల్లెలకు ఇచ్చే వాడు. ఆ పువ్వులు పద్మ జడలో అలంకరింపబడి, ఆ ముఖం వెలుగుతుందనే 'భావన'తోనే, అతనా వేసవి సెల వులు గడిపేశాడు. ధైర్యంచేసి పద్మ యింటికి వెళ్ళి

మామయ్యచేత అవమానింపబడితే, ఉన్న ఆశాకిరణం కూడా అస్తమిస్తుందేమోనని భ్రూరుకొన్నాడు.

"ఈ దౌర్భాగ్యుడు ఆనర్సు కూడా పూర్తిచేస్తాడని నాకు నమ్మకంలేదు. మూర్ఖతలో ఇతను తండ్రికి ఏమాత్రం తీసిపోడు" అన్నాడట వెంకటరత్నం కూతురుతో.

పద్మమనసు చెప్పింది—

"ఈ పరిస్థితి తొలగుతుంది. శంకరం తప్పకుండా నా వాడే. నేను శంకరం భార్యగానే పుట్టా. అది జరిగి తీరుతుంది" అని!

శంకరం విశ్వాసమూ అదే!

'పద్మలేని శంకరం' అనే మనిషి లేనేలేడు. శంకరం లేని పద్మకూడా లేనేలేదు. పుట్టుకతోటే ఇద్దరూ భార్యాభర్తలు. ఎవరూ కొత్తముద్ర వేయనక్కరలేదు." అనుకొనేవాడు.

* * *

చల్లగాలి వీచింది. అతని మనసు ఒకసారి ఆనందంగానూ, ఒకసారి దిగులుగానూవుంది. పరీక్షలయిపోయాయి. యూనివర్సిటీ ఫస్టొచ్చి, స్కాలర్ షిప్ వస్తే, రిసెర్చి చేయాలనుకొంటున్నాడు. తప్పకుండా వస్తుందనే నమ్మకం. ఆ నమ్మకం ఆనందం కలిగిస్తోంది. పద్మను చూడకుండా ఎలా వుండటం? పద్మ మాటలు వినిపించనిచోట, పద్మ నీడలేని చోట ఎలా వుండటమనే తపన అధికమైంది. వరసగా నాలుగురోజులు మల్లెలుకోసి వుంచాడు. పద్మ చెల్లెలయినా కనిపించలేదు.

రెండేళ్ళ క్రితం పద్మ తన జేబులో విసిరిన మల్లెపూవు వాడి ముకుళించుకుపోయింది. దాన్నతడు చిన్న రంగు కవరులో భద్రపరచుకొన్నాడు. ఆ కవరు చూశాడంటే చాలు—అది ఆ నాటి పరిమళాల్ని వికాసాన్ని తీసుకొని వచ్చి, ఆనందపరవశుణ్ణిచేసి ఆత్మవిశ్వాసం కలగజేస్తుంది. ఆ విశ్వాసంతో మళ్ళీ "పద్మ హృదయం ఇక్కడేవుంది, ఇంకెవరూ తీసుకుపోలేరు," అని ఆ కవరును కళ్ళకద్దుకొంటాడు.

"ఈ రోజు పద్మ కనిపించకపోతే . బ్రతకలేనను కొన్నాడు. పద్మ మనసుకూడా ఇలాగే బాధ పడుతూ వుండదూ! రెండు స్పందించే హృదయాలకు మధ్య ఒకే గీత ఒకే గోడ! ఆ గోడను ఛేదించడం సాధ్యం కాకుండా వుంది, ఆ గోడను ఛేదించే ప్రేలుడు సామాను వెంకటరత్నం దగ్గర వుంది. అతను అనుకొంటే, మీట నొక్కి ఆ గోడను ఎత్తేసి రెండు హృదయాలను సమ్మిళితంచేసి అమృతం పుట్టించ గలడు. కానీ మంటలు పుట్టించడమే అతని లక్ష్యం.

ఆలోచిస్తున్న శంకరానికి పరిచితమైన 'నడక' విని పించింది! ఆ నడకలో లయ ఎవరిదో అతనికి తెలుసు. పద్మ వస్తోంది.

అతను వెంటనే లేచి మల్లెపందిరి దగ్గరకు వెళ్ళాడు. ఒక్కొక్క మల్లెమొగ్గనే తుంపుతున్నాడు. పద్మ వచ్చి పక్కనే నిల్చుంది. పది మొగ్గలు ఆమెచేతికందించాడు. ఆ మొగ్గలు ఆమెచేతిలో కొత్తవికాసం పొందాయి.

అతనామె గడ్డం పట్టుకొని అన్నాడు. "చెప్పు పద్మా! ఎన్నాళ్ళిట్లా! మన మధ్య ఈ ఉక్కుతెరలేమిటి ?

మన వేడినిట్టూర్పులతో ఈ ఉక్కుతెర కరిగిపోయే వీల్లేదూ! మామయ్యను ఎందుకింత ఖాతరు చేయాలి. ఆయనెవరు? ఇంక నాచేత కాదు. ఇక నిన్ను దూరంగా చూడలేను." అంటూ ఆమెను దగ్గరకు తీసుకోబోయాడు.

ఆమె విశ్వాసంతో కూడిన చిరునవ్వు నవ్వింది. శరీరం వేడెక్కింది. వేళ్ళలో రక్తం చిమ్మింది. చేతిలో మొగ్గలు వికసించాయి!

"ఎప్పుడూ వేరు కాము శంకరం! ఇంకా సమయం రాలేదు. అంతే" అందామె.

అతనామెను దగ్గరకు తీసుకొని నుదుటిమీద ముద్దు పెట్టుకొన్నాడు. ఆమె చేతిలో పూలు అతని భుజాలమీద పోసింది!

• • •

వెంకటరత్నం ఎప్పుడూ ఏదో పనిలో నిమగ్నుడై వుంటాడు. అతను చేసే వ్యాపారం 'ఫలానా' అని చెప్పడానికి వీలులేదు. ఏ వ్యాపారం ఎప్పుడు లాభిస్తుందనిపిస్తే, అప్పుడు ఆ వ్యాపారం చేస్తూ, గడిస్తూ వుంటాడు. తన మేధాశక్తిమీద, ఊహాబలంమీద అతనికి విపరీతమైన నమ్మకం. ఆ నమ్మకంతోనే అతడు ఏ వ్యాపారంలోనైనా అమిత సాహసంతో ప్రవేశిస్తూ వుంటాడు. అతని ప్రయత్నాలు, నూటికి తొంభైపాళ్ళు విజయవంతమవుతూ వుంటాయి. అతని వ్యూహాలు, అంచనాలు తలక్రిందు లవడమనేది ఎప్పుడోగానీ జరగదు. అతను ఒక వ్యాపారం చేయదలచుకొంటే, దానికి సంబంధించిన అన్ని విషయాలూ ఆలోచిస్తాడు.

ఉదాహరణకు అతనికి ఆవకాయ వ్యాపారం చేయాలనే తలంపు కలిగిందనుకోండాం. అప్పుడు- "మామిడి కాయల కాపు ఎలావుంది? వర్షాలు ఎలావున్నాయి? విని యోగ దారుల కొనుగోలుశక్తి ఎలావుంది? బియ్యం మొదలైనవాటి ధరలు ఏలావున్నాయి. వేరుశనగపంట ఎలావుంది. ప్రపంచ పరిస్థితులు మనుష్యులను ఏవిధమైన మన స్తత్వంలో వుంచుతున్నాయి..." ఇవన్నీ, కూలం కష్టంగా కూపీతీసి తెలుసుకొని, ఆ మీదట, ఆ యేడు ఆ వ్యాపారం లాభకరమైన దనిపిస్తే, తక్షణం ప్రారంభించి, అతి తక్కువ వ్యవధిలో ఆ వ్యాపారంచేసి, సరుకు పూర్తిగా వదిలించుకొని, రొక్కం కళ్ళ చూసుకొని, మళ్ళీ మరో వ్యాపారంలోకి వెళ్ళి పోతాడు.

"ఈ ఏడు మంచివర్షాలు కురిశాయి. చెరువులు, నదులలో నీళ్ళున్నాయి. పుష్కలంగా చేపలుంటాయి. అంచేత దేశంలో చింతపండు అవసరం అధిక మవుతుంది. గడిచిన ఏడాదివరకు కరువుగావుండి వేలకొలదీ చింతచెట్లు వంట కలపకో, బొగ్గులకో కొట్టివేశారు. అందుచేత ఈసారి చింతపండు తక్కువగా వుంటుంది. ఈసారి ముందుగానే పూత మీదనే చెట్లుకొనేస్తే, లాభం దంచేయవచ్చుననే ఆలోచన కలిగింది ఈసారి వెంకటరత్నానికి.

వెంటనే వ్యాపారం ప్రారంభించాడు. ఏన్నో చెట్లు కొనేశాడు. కాయలు పండగానే కోయించి, కొట్టించి పండు చేశాడు. విక్రయం ప్రారంభించాడు.

హఠాత్తుగా దేశంలో వర్షాలు ఎక్కువయ్యాయి. తత్ఫలితంగా చెరువులు గట్లు తెగి, నదులకు వరదలొచ్చి, చేపలన్నీ పోయాయి. అదీగాక చాలఏళ్ళ తర్వాత అదే మొదటి వర్షం గనక రైతులు గత అనుభవాన్ని పురస్కరించుకొని, రకరకాల పంటలు వేశారు. అందులో ఆ ప్రాంతంలో టొమేటోలు ఎక్కువగా వేశారు. ఎక్కడచూసినా ఆ పళ్లే! చింత పండు వాడకం పూర్తిగా తగ్గిపోయింది.

ఇంకా చాల కారణాలవల్ల, ఆ యేడు వెంకటరత్నం వ్యాపారం పూర్తిగా దెబ్బతిన్నది. పెట్టుబడి పెట్టినడబ్బు తిరిగి రాలేదు. పైగా అతనిదగ్గర సహాయకుడుగా పనిచేస్తూ వుండి నతను కొన్నివేల రూపాయలతో పలాయనమై పోయాడు. ఆ ఏడు చింతచెట్లు కొన్నందుకుగాను రైతులకు ఇవ్వవలసిన డబ్బుకోసం అదనంగా చాలడబ్బు వ్యయమైంది. చింతపండు తర్వాత, బెల్లం వ్యాపారం చేశాడు. అదీ దెబ్బ తిన్నది. ఉన్నడబ్బంతాపెట్టి వ్యాపారం చేశాడు. పెట్టిన డబ్బు చేతికిరాలేదు. బెల్లం విదేశాలకు పంపడానికి ప్రభుత్వం నిరాకరించిన ఫలితంగా ఆ వ్యాపారం ఘోరంగా దెబ్బ తిన్నది.

♦ ♦ ♦

పరీక్షా ఫలితాలు పత్రికలలో ప్రకటింప బడినాయి. శంకరం యూనివర్శిటీ ఫస్టొచ్చాడు.

ప్రభుత్వం అతడు ఒక ప్రత్యేకవిషయం మీద పరిశోధించడానికిగాను మాసానికి రెండువందల ఏభైరూపాయల విద్యార్థి వేతనం ఇవ్వదలచినట్లు ప్రకటించింది.

ఆ విషయం తెలిసిన వెంకటరత్నం చాల సంతోషించాడు. తన అల్లుడు దరిద్రుడు కానేకాదు! కాబోయే పెద్దఉద్యోగి! ఆర్జించబోయే సమర్థుడయిన, తెలివైన, చురుకయిన యువకుడు!

ఆ సాయంకాలం అతను శంకరం ఇంటికి వచ్చాడు. సరస్వతమ్మను ఎంతో ఆప్యాయంతో పలకరించి, మాట్లాడాడు. ఆమెకూడా ఎంతో గౌరవించింది.

"నేనిప్పుడు అర్జెంటుగా ఒక విషయం చెప్పాలని వచ్చాను. ఈ విషయం ముందే చెప్పివుంటే, శంకరం ఎందుకూ పనికిరానివాడై పోయివుండేవాడు. అసలు ఆనర్సే పాసయివుండేవాడే కాదు. నేనలా నిర్దయంగా ప్రవర్తించడం వల్ల తన వ్యక్తిత్వమంటూ ఏర్పరచుకోవలసిన అవసరాన్ని అతడు గుర్తించాడు. పైగా నామీద పగ తీర్చుకోవాలనే పట్టుదల కలిగింది. నేను పద్మను ఇంకెవరికయినా ఇచ్చి పెళ్ళి చేస్తానేమో ననే శంక కలిగింది. అది కేవలం తన అసమర్థత వల్ల జరుగుతున్న అన్యాయమని భావించాడు. 'ఎలా అయినా సరే తను సామర్థ్యం కలిగినవాడు కావాలి; పద్మ మనసు పూర్తిగా తనది చేసుకొని మామయ్యకు అవమానం చేయాలి' అనే బలమైన సంకల్పం కలిగింది. అతని కీ సంకల్పం కలగకుండా వుంటే, ఇంత ఉన్నతికి రాగలిగేవాడే కాదు. మన పద్మ అతణ్ణి ఇష్టపడేదికూడా కాదు. అతడు పద్మ అంటే ఇంత పడి చచ్చేవాడూ కాదు. అంతా నే ననుకొన్నట్టే జరిగింది. నాకు తెలుసు. నా ఊహాలు ఎప్పుడూ తప్పుకావు. ఇప్పుడు

నా ప్లాను పూర్తయింది. కాబట్టి చెప్పేశాను. ఇంక ఫరవా లేదు. నాకు చాల సంతోషంగా వుంది," అన్నాడు.

"మీ ఉపన్యాసం చాల్లేనాన్నా! అదంతా రాసి అచ్చు వేయించండి. మిమ్మల్ని ప్రపంచం మేధావిగా గుర్తిస్తుంది. మీ వ్యాపారం దెబ్బతినకుండావుండి, శంకరానికి స్కాలర్‌షిప్ రాకుండావుంటే మీరు ఎంత కసాయివాడిలా ప్రవర్తించే వారో అందరికీ తెలుసు. ఇప్పుడీ మేకపోతు గాంభీర్యం ఎందుకు ?! అత్తయ్యను క్షమించమంటే సరిపోదూ! " అంది వెనక నుంచి పద్మ !

వెంకటరత్నం చకితుడై కళ్ళురిమి కూతుర్ని చూసి, వెంటనే కృంగిపోయాడు. కొన్ని నిముషాల్లో శక్తిని కూడ దీసుకొన్నాడు.

"మీరు చిన్నపిల్లలు. మీకు తెలీదులే! నా ఊహాశక్తి మీ కేం తెలుసు. పోనీలే! మీరు బాగుపడ్డారు. నా కంతే చాలు" అంటూ లేచి వెళ్ళిపోయాడు.

శంకరం మరోప్రక్క ఆశ్చర్యంతో చూస్తున్నాడు. పద్మ అలా అంటుందని అతను ఊహించలేదు. గోడకాను కొని నిల్చున్న సరస్వతమ్మ కళ్ళవెంబడి నీళ్ళు ఆనంద బాష్పాలా?

ఆ ఇద్దరి స్పందించే హృదయాలు, తమ శరీరాల్ని దూరాన్నే వుంచి, ఆక్షణాన ఏకమై సరస్వతమ్మ కన్నీళ్ళు తుడిచాయి.

—•••—